# సీఎం సభకు కదిలిన బీఆర్‌ఎస్ సైన్యం





సత్తుపల్లి : నడిచివస్తున్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వేంసూరు : చౌడవరంతండా నుంచి భారీగా తరలివెళ్లిన తండా మహిళలు, కార్యకర్తలు

- కిక్కిరిసిన సభా ప్రాంగణం
- బారులుతీరిన వాహనాలు

సత్తుపల్లి, నవంబర్ 1 : సత్తుపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య విజయాన్ని కాంక్షిస్తూ కల్లూరులో బుధవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు గ్రామాల నుంచి ట్రాక్టర్లు, లారీలు, ఆటోలు, ద్విచక్రవాహనాల్లో నాయకులు, కార్యకర్తలు కల్లూరు వెళ్లారు. సభ ప్రాంగణం జనంతో కిటకిటలాడింది. సభ సక్సెస్ కావడంతో బీఆర్‌ఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

వేంసూరు, నవంబర్1: కల్లూరు షుగర్ ఫ్యాక్టరీ వద్ద బుధవారం నిర్వహించిన ప్రజాశీర్వాద సభకు నియోజకవర్గం నలుమూలల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. వేంసూరు మండలం నుంచి బైకులు, డీసీఎంలు, బస్సులు, ఆటోల్లో తదితర వాహనాల్లో కల్లూరు చేరుకున్నారు.

తల్లాడ, నవంబర్1: నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య విజయాన్ని కాంక్షిస్తూ కల్లూరులో ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే సండ్ర ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేసేందుకు తల్లాడ నుంచి బీఆర్‌ఎస్ నాయకులు భారీగా తరలివెళ్లారు. ర్యాలీని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జీ.వీ.ఆర్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు దూపాటి నరేశ్‌రాజు, బొడ్డు వెంకటేశ్వరరావు, గుండ్ల వెంకటి, గుండ్ల నాగయ్య, గుడిబండ్ల మహేశ్, శివ తదితరులు పాల్గొన్నారు.

పెనుబల్లి, నవంబర్ 1 : కల్లూరు సభకు కొత్త కారాయిగూడెం నుంచి ప్రజలు, నాయకులు, కార్యకర్తలు దండుగా కదిలారు. గ్రామంలో సర్పంచ్ దొడ్డపునేని శ్రీదేవి ఆధ్వర్యంలో వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లలో సభకు తరలివెళ్లారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.







తల్లాడ : జెండా ఊపి ర్యాలీను ప్రారంభిస్తున్న నాయకులు, పెనుబల్లి : సీఎం బహిరంగ సభకు వెళుతున్న ప్రజలు, వేంసూరు : ఆటోలో తరలివెళ్తున్న మహిళలు

## ఆటపాటలతో మధుప్రియ ధూంధాం

తల్లాడ, నవంబర్ 1 : తెలంగాణ పాటలతో గాయని మధుప్రియ చేసిన ధూంధాం ఆటపాటలు బీఆర్‌ఎస్ కార్యకర్తలను ఉర్రూతలూగించాయి. గులాబీ జెండాలే రామక్క...అనే పాటతో మహిళలను, యువకులకు గాయని మధుప్రియ అలరించారు. మధుప్రియ పాట పాడుతుండగా ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య స్టేజీపై నృత్యం చేయడంతో కార్యకర్తలు చప్పట్లు, విజిల్స్‌తో సభా ప్రాంగణం మారుమోగింది. సారు రావాలంటున్నాయి తెలంగాణ పల్లెలన్నీ...మళ్లీ కేసీఆరే ముఖ్యమంత్రి అంటూ ఆలపించిన మరో పాట సభా ప్రాంగణాన్ని ఉర్రూతలూగించింది. గాయని మధుప్రియ సభా వేదికపై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రచయిత, గాయకుడు మానుకోట ప్రసాద్ సండ్రన్న దండు కదిలిందంటూ ఆలపించిన గేయంతో సత్తుపల్లి గడ్డపై గులాబీ జెండాలమ్మా పాటతో సభాప్రాంగణంలో ఉన్న వారు హర్షధ్వానాలు వ్యక్తం చేశారు.



సభాస్థలి వద్ద మధుప్రియ పాటకు నృత్యం చేస్తున్న పువ్వాడ, సండ్ర

## బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం

పెనుబల్లి, నవంబర్ 1 : సత్తుపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య గెలుపు కోరుతూ మండల పరిధిలోని గణేశ్‌పాడులో నాయకులు బుధవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ గోదా చెన్నారావు, నాయకులు లగడపాటి శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో గడపగడపకూ వెళ్లి బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టి అమలుచేసిన పథకాలు, నియోజకవర్గంలో సండ్ర చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## ఉపాధ్యాయులపైనే విద్యార్థుల భవిష్యత్ : డీఈవో

వేంసూరు, నవంబర్ 1: విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయులపై ఆధారపడి ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర్‌శర్మ అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించి తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు అందించి మాట్లాడారు. పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు నూటికి నూరు శాతం ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈవో వేంకటేశ్వరరావు, హెచ్ఎం సుధాకర్‌రెడ్డి, రాజేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సత్తుపల్లి రూరల్, నవంబర్ 1 : ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టిన ఉన్నతి లక్ష్యపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఈవో సోమశేఖరశర్మ అన్నారు. సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి మండలాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల హెచ్ఎంలతో బుధవారం నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. కార్యక్రమంలో నోడల్ అధికారి నక్కా రాజేశ్వరరావు, వేంసూరు ఎంఈవో వెంకటేశ్వరరావు, హెచ్ఎంలు జయరాజు, యాకోబు, నాగేశ్వరరావు, శైలకుమారి, నాగమణి, సుధాకర్‌రెడ్డి, సత్యనారాయణ, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సూచనలు చేస్తున్న డీఈవో సోమశేఖరశర్మ

## కేసీఆర్‌పై కొండంత అభిమానం

పెనుబల్లి, నవంబర్ 1 : సీఎం కేసీఆర్‌పై కొండంత అభిమానంతో మహిళలు, ముస్లింలు ఆయన్ను చూసేందుకు కల్లూరులో సీఎం బహిరంగ సభకు ఉత్సాహంగా తరలివచ్చారు. మాకు పింఛన్లు ఇస్తున్న పెద్ద కొడుకు నా బిడ్డలకు కల్యాణలక్ష్మి అందిస్తున్న పెద్దన్న పండుటాకులకు అండగా ఉంటున్న కేసీఆర్‌ను కళ్లారా చూశామంటూ ఆనందం వ్యక్తం చేశారు. కేసీఆర్‌పై అభిమానం వారి మాటల్లోనే....

### కేసీఆర్‌ను కళ్లారా చూశాం..



ప్రతిరోజూ టీవీలో చూస్తున్నాం. నేడు ఆయన్ని కళ్లారా చూసే భాగ్యం కలిగింది. కేసీఆర్ మీద ఉన్న అభిమానంతో చెన్నూరు నుంచి సభకు వచ్చాను. ఆయన్ను నేరుగా చూడటం.. ఆయన మాటలు ఆసక్తి వినడంతో రాజకీయ నాయకుడంటే ఇలా ఉండాలని అనుకుంటున్నా. మళ్లీ కేసీఆరే రావాలి.

**- రేపాకుల రాధ, చెన్నూరు, కల్లూరు మండలం**

### పెద్దాయనకే మా ఓటు



ముఖ్యమంత్రి కేసీఆర్‌కే మా మద్దతు.. కారు గుర్తుకే మా ఓటు. ఎన్నో మంచి పనులు చేసిండు..ఓటేసి మళ్లీ గెలిపిస్తే ఇంకా మరిన్ని పనులు చేస్తాడనే నమ్మకం ఉంది. ఆయనకు ఓటు వేయకపోతే బాగుండదు కదా... మళ్లీ కేసీఆర్ రావాలని కోరుకుంటున్నా.

**- చింతలపాటి లక్ష్మి, చిన్నకోరుకొండి, కల్లూరు మండలం**

### మళ్లీ కేసీఆరే రావాలి



వృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులకు అండగా ఉంటూ ఆసరా పింఛన్లతో కొండంత ధైర్యం నింపుతున్న ఆ సారే మళ్లీ సీఎంగా రావాలని కోరుకుంటున్నాం. ఏదేమైనా కేసీఆర్ సార్‌కే మా మద్దతు..ఈ ప్రాంతంలో ఎమ్మెల్యే సండ్రకే మా ఓటు. బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదే మళ్లీ అధికారం. **- దంతాల సుశీల, చెన్నూరు**



నాకు ఎకరంన్నర పొలం ఉంది. ఎకరంన్నరకు రూ.7.30వేల చొప్పున రెండు దఫాలుగా రైతుబంధు వస్తుంది. వీటితో పాటు నాకు వృద్ధాప్య పింఛన్ రూ.2వేలు వస్తుంది. ఇలాంటి ముఖ్యమంత్రి మళ్లీ రావాలి. కేసీఆర్‌కే ఓటేస్తాం... మళ్లీ అధికారంలోకి తెచ్చుకుంటాం.

**- బైరెడ్డి అనంతరెడ్డి, కొర్లగూడెం గ్రామం, కల్లూరు మండలం**

### అన్నదాతలకు అండగా నిలిచిన కేసీఆర్



తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ సారు రైతులకు అండగా నిలిచారు. నేడు అన్నదాతలు ఆనందంగా ఉన్నారంటే అది కేసీఆర్ చలువే. ఆయన చేపట్టిన పథకాలు చారిత్రాత్మకం. మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమే రావాలి... అప్పుడే అందరికీ మంచి జరుగుతుంది. **- బండి అంజమ్మ, కల్లూరు**

### కేసీఆర్ సారు చల్లంగుండాలి ..



నాకు ముగ్గురు కుమార్తెలు..ముగ్గురికీ వివాహం చేశాను. ప్రస్తుతం నాకు వృద్ధాప్య పింఛన్ రూ.2వేలు వస్తుంది. దొర కేసీఆర్ వల్లే బతుకుతున్నా. ఆయన పుణ్యమా అంటూ అన్నం తింటున్నా. కూతుళ్లు చూడటం లేదు. మళ్లీ కేసీఆర్ దొరగారు అధికారంలోకి వస్తే రూ.5వేలు పింఛన్ పెంచుతామంటున్నారు. ఇలాంటి నేత కేసీఆర్ చల్లంగుండాలి.

**- ఖమ్మంపాటి బుచ్చయ్య, కొత్త నారాయణపురం**

### సీఎం కేసీఆర్ మేనమామగా మారారు..



ముఖ్యమంత్రి కేసీఆర్ వచ్చిన దగ్గరి నుంచి షాదీముబారక్ పేరున నా కుమార్తెకు మేనమామలా రూ.1,00,116లు ఇస్తున్నారు. మూడు నెలల క్రితం నా కూతురు పెళ్లి చేయడంతో ఎమ్మెల్యే సండ్ర చెక్కు అందించారు. కేసీఆర్ సారే సీఎంగా రావాలి.

**- షేక్ గోర్బి, పుల్లయ్యబంజరు, కల్లూరు**


### ఇల్లొచ్చింది...కల్యాణలక్ష్మి వచ్చింది..



నాకు డబుల్ బెడ్‌రూం ఇల్లు కేసీఆర్, ఎమ్మెల్యే సండ్ర పుణ్యాన వచ్చింది. రెండేళ్ల క్రితం భర్త కూడా చనిపోయారు. నా కుమార్తె వివాహం తర్వాత కల్యాణలక్ష్మి చెక్కు వచ్చింది. మరో కుమార్తె ఉంది. ఇల్లు వచ్చింది.. బీఆర్‌ఎస్ ప్రభుత్వమే ఎప్పుడూ అధికారంలో ఉండాలని కోరుకుంటున్నా. మళ్లీ సీఎంగా కేసీఆర్ సారే రావాలి.

**- వలసాల పద్మావతి, తల్లాడ**

### రైతు సంక్షేమానికి సీఎం కృషి



వేంసూరు, నవంబర్ 1: సీఎం కేసీఆర్ రైతులు అడగకుండానే పెట్టుబడి సాయం అందించి ఆదుకున్నారు. గతంలో సాగు పెట్టుబడి కోసం అప్పులు చేసి ఇబ్బందులు పడేటోళ్లం. కానీ తెలంగాణ ఏర్పడ్డాక సీఎం రైతుబంధు ద్వారా ఏడాదికి ఎకరాకు రూ.10 వేలు అందిస్తున్నారు. మూడోసారి కూడా కేసీఆర్ గెలిచి ఏడాదికి ఎకరాకు రూ.16 వేలు అందిస్తారనే నమ్మకం ఉంది.

**- వేము అప్పయ్య, మంగాపురం, తల్లాడ మండలం**